సాక్షి
వికారాబాద్

గురువారం । 16 । నవంబర్ । 2023



నిధులిస్తామని..

తండా అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పి ఎమ్మెల్యే మోసం చేశారని రాంపూర్‌తండా వాసి ఠాగూర్ ఆరోపించారు. 10లో▸



అభివృద్ధి శూన్యం

వికారాబాద్ అభివృద్ధికి ఎమ్మెల్యే చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్ సోదరి ప్రియ ఆరోపించారు. 10లో▸



గులాబీ గూటికి స్వతంత్రులు

నామినేషన్ వేసి ఉపసంహరించుకున్న పలువురు స్వతంత్ర అభ్యర్థులు బుధవారం 'గులాబీ' తీర్థం పుచ్చుకున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

కోరం లేక జెడ్పీ సమావేశం వాయిదా



జెడ్పీ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న చైర్‌పర్సన్ సునితారెడ్డి

అనంతగిరి: కోరం లేకపోవడంతో బుధవారం జరగాల్సిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ సునితారెడ్డి వాయిదా వేశారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండటంతో సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. త్వరలో తేదీ ప్రకటించి సమావేశం నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సీఈఓ జానకిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు వికారాబాద్‌కు కేటీఆర్

- మర్పల్లి, వికారాబాద్‌లో రోడ్‌షోలు
- భారీ జన సమీకరణకు బీఆర్‌ఎస్ ఏర్పాట్లు

వికారాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ గురువారం వికారాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వికారాబాద్ పట్టణం, మర్పల్లి మండల కేంద్రంలో నిర్వహించే రోడ్ షోల్లో పాల్గొంటారు. హెలిక్యాప్టర్ ద్వారా రానున్న ఆయన మధ్యాహ్నం 2గంటలకు వికారాబాద్ పట్టణంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం 3గంటలకు మర్పల్లి రోడ్‌షోలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యే ఆనంద్ భారీ జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో రోడ్‌షోలో 25 వేల నుంచి 30 వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కేటీఆర్ రోడ్‌షో ఏర్పాట్లను ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్ పర్యవేక్షిస్తున్నారు.

సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా

అనంతగిరి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని చెక్‌పోస్టులు, సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 6,086 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎన్నికల తీరును పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాల్లో, ప్రధాన కూడళ్లలో, పోలింగ్ కేంద్రాల సమీపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

'కారు' పార్టీలోకి కవితాదేవి



హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కవితాదేవి

ఇబ్రహీంపట్నం రూరల్: వైఎస్సార్ టీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కవితాదేవి కారెక్కారు. బుధవారం ఆమె నగరంలోని మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి ఆమెకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవితాదేవి మాట్లాడుతూ.. పదేళ్లుగా వైఎస్సార్‌టీపీలో చురుకైన నాయకురాలిగా పనిచేశానన్నారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితురాలినై బీఆర్‌ఎస్‌లో చేరానన్నారు. ఇబ్రహీంపట్నం అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

నామినేషన్ ఉపసంహరణ

అత్తాపూర్: రాజేంద్రనగర్ నియోజవర్గంలో స్వతంత్ర అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు రాజేంద్రనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు. మొత్తం నియోజకవర్గంలో 26 మంది అభ్యర్థులుండగా.. బుధవారం స్వతంత్ర అభ్యర్థి సాధిక్ బిన్ యూసుఫ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నాడన్నారు. ప్రస్తుతం 25 మంది ఎన్నికల బరిలో ఉన్నారని వివరించారు.

బరిలో 61

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ

- కొడంగల్‌లో ఇద్దరు, తాండూరులో నలుగురు విత్‌డ్రా
- తాండూరు అసెంబ్లీ స్థానానికి అత్యధికంగా 21 మంది పోటీ
- ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: కలెక్టర్ నారాయణరెడ్డి
- ఇంటింటికీ ఓటరు స్లిప్పులు అందజేస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. బుధవారంతో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో కలెక్టర్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులకు పలు సూచనలు చేశారు. పోలింగ్, కౌంటింగ్ తదితర ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. మద్యం, డబ్బులకు తలొగ్గకుండా ఓటు వేసి మంచి నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు.

కలెక్టర్ సూచనలు ఆయన మాటల్లోనే..

- జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నామినేషన్ల పరిశీలన అనంతరం 67 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, తాండూరులో నలుగురు, కొడంగల్‌లో ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా 61మంది పోటీలో ఉన్నారు. పరిగిలో 15 మంది, వికారాబాద్‌లో 12 మంది, తాండూరులో 21 మంది, కొడంగల్‌లో 13 మంది ఎన్నికల బరిలో ఉన్నారు.
- 15 మంది అభ్యర్థులు పోటీలో ఉంటే ఒకే ఈవీఎం, అంతకు మించితే రెండో ఈవీఎంను ఏర్పాటు చేస్తాం. ఒక ఈవీఎంలో నోటాతో కలిపి 15 మందికి సంబంధించిన గుర్తులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.
- జిల్లాలో మొత్తం 9,60,376 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 4,77,528 మంది పురుషులు, 4,82,808 మంది మహిళా ఓటర్లు, 40 మంది ట్రాన్స్ జండర్లు ఉన్నారు.
- జిల్లాలో 1,133 పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. పరిగిలో 305, వికారాబాద్‌లో 284, కొడంగల్‌లో 275, తాండూరులో 269 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కొడంగల్‌లో కొత్తగా మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున అనుమతుల కోసం పంపాం. జిల్లాకు అవసరమైన 934 ఈవీఎంలు, ఈవీప్యాట్‌లు అందుబాటులో ఉన్నాయి.
- ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఓ సెట్ ఓటరు జాబితాను ఉచితంగా అందజేస్తాం. ఇతరులు ఓటరు జాబితా పొందాలంటే అందుకు అయిన ఖర్చును చెల్లించాల్సి ఉంటుంది.
- బీఎల్‌ఓల ద్వారా ప్రతి ఇంటికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తాం. ఈ ప్రక్రియను గురువారం నుంచి ప్రారంభించి 23వ తేదీ నాటికి పూర్తి చేస్తాం.
- కోడ్ ఉల్లంఘనలపై సీ -విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు అందిన వెంటనే సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటాం. ఈ యాప్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 49 ఫిర్యాదులు అందాయి. ఇందులో ఒక దానిపై క్రిమినల్ కేసు నమోదు చేశాం.
- మొత్తం నాలుగు క్యాటగిరీలుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహిస్తాం. ఇందులో ఎన్నికల విధులు నిర్వహించే పీఓ, ఏపీఓ, ఓపీఓలకు, అత్యవసర సేవలు అందించే ఉద్యోగులకు అందజేస్తాం.
- ఈ నెల 29న ఓటింగ్ సామగ్రి పంపిణీ, 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ నిర్వహిస్తాం. పరిగి మార్కెట్ యార్డులో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం.
- జిల్లాలో ఇప్పటి వరకు తనిఖీ బృందాలు 2.81 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నాయి. ఆధారాలు చూసిన వారికి రూ. 2.25 కోట్లు తిరిగి అందజేశాం.
- ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5గంటలకు ప్రచారం చేసుకునేందుకు అవకాశం ఉంది. అప్పటి వరకు ప్రతిరోజూ ఉదయం 6నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం చేసుకోవచ్చు. 30వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తాం.

21నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

వికారాబాద్ అర్బన్: రెండో విడత ర్యాండమైజేషన్ కార్యక్రమం ద్వారా ఎంపికైన సిబ్బందికి ఈ నెల 21, 22, 23 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సీ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు పీ ఆకాష్, సుధాకర్ జైలాక్సోల సమక్షంలో పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ల రెండో విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాలకు సంబంధించి పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. 214 మంది మైక్రో అబ్జర్వర్లతో పాటు, రిజర్వ్ మైక్రో అబ్జర్వర్ల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీఓ కృష్ణన్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, ఈడీఎం మహమూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి

పరిగి: పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఎన్నికల పరిశీలకులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. అంతేకాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నీటి వసతి, సిబ్బంది, పోలింగ్ ఏజెంట్ల వాహనాల కోసం పార్కింగ్, మరుగుదొడ్లు వంటి సదుపాయం కల్పించాలన్నారు. మీడియా పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమయం తక్కువగా ఉన్నందున ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు ఆకాశ్, సుధాకర్ జైలాక్సో, ఎస్పీ కోటిరెడ్డి, ఆర్‌ఓ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోరుకు 'దండెం' దూరం

- నామినేషన్ విత్‌డ్రా చేసుకున్న కాంగ్రెస్ రెబల్ రాంరెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరుతారంటూ ప్రచారం

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి దండెం రాంరెడ్డి బుధవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఇబ్రహీంపట్నం స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించి తుది వరకు అధిష్టానంతో దండెం కుస్తీ పట్టారు. టికెట్ తనకే దక్కుతుందని ఆశించినా చివరి నిమిషంలో చేజారింది. దీంతో ఆయన గాంధీభవన్‌లో తన అనుచరులతో కలిసి ఆందోళనకు దిగారు. అధిష్టానం బుజ్జగింపులకు లొంగని ఆయన కాంగ్రెస్ రెబల్‌గా నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి రెబల్‌గా దండెం పోటీలో ఉంటారని భావించారు. కానీ అనూహ్యంగా ఆయన తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు.

'దండెం' దారెటో..?

నామినేషన్ ఉపసంహరించుకున్న ఆయన కారెక్కుతారనే వార్తలు నియోజకవర్గ వ్యాప్తంగా చక్కర్లు కొడుతన్నాయి. కాంగ్రెస్ అధిష్టానం తనను నమ్మించి మోసం చేసిందని.. కాంగ్రెస్ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా ఆయన బీఆర్‌ఎస్‌తో జతకట్టేందుకు సిద్ధమవుతున్నారని ఆయన సన్నిహితులు చర్చించుకుంటున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ విషయమై పూర్తి క్లారిటీ వస్తుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 100 మంది యాత్రికులు బుధవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉమ్రాయాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు

పెట్రోల్ పోసి.. తగులబెట్టి

- మహిళ దారుణ హత్య
- ముచ్చర్ల శివారులో ఘటన



యాదమ్మ (ఫైల్)

యాచారం: పెట్రోల్ పోసి తగులబెట్టి ఓ మహిళను దారుణంగా హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన మంథని కృష్ణ విద్యుత్ శాఖలో హెల్పర్‌గా పని చేస్తూ నాలుగేళ్ల క్రితం గ్రామంలోనే ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గ్రామస్తుల ఆందోళనతో ప్రభుత్వం కృష్ణ భార్య యాదమ్మ(38)కు తుర్కయంజాల్‌లో ఉన్న విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగం కల్పించింది. ఆమె నిత్యం జాపాల నుంచి తుర్కయంజాల్‌కు వెళ్లి వస్తుండేది. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరింది. రాత్రి 10 గంటలైనా ఇంటికి రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై మంచాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ముచ్చర్ల శివారులోని చాకలోనికుంట సమీపంలో కాలిపోయిన ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు యాదమ్మ కుటుంబ సభ్యులను పిలిపించగా మృతదేహం ఆమెదేనని గుర్తించారు. పోలీసులు క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. సంఘటనా స్థలాన్ని ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా, జాపాల గ్రామం నుంచి మంగళవారం ఉదయం తుర్కయంజాల్‌లోని విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయంలో విధులకు వెళ్లిన యాదమ్మ సాయంత్రం కార్యాలయం ముందున్న సాగర్‌రోడ్డు వద్దకు వచ్చి ఓ కారులో వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. ఆమె ఎవరి కారులో వెళ్లింది.. కారు లో ఉన్నదెవరు.. స్వగ్రామంలో ఏమైనా తగాదాలున్నాయా.. ఎక్కడో చంపి మృతదేహన్ని ఇక్కడి కి తీసుకొచ్చి పడేశారా.. అత్యాచారం చేసి, ఆనవాళ్లు దొరక్కకుండా తగులబెట్టడానికి యత్నించారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యాద మ్మ వెళ్లిన కారు నంబర్‌ను సీసీ ఫుటేజీలో గుర్తించిన పోలీసులు ఆ దిశలో వివరాలు సేకరిస్తున్నారు.

జాపాలలో విషాదఛాయలు

మంచాల: యాదమ్మ మృతితో ఆమె స్వగ్రామం జాపాలలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతురాలికి కూతుళ్లు అర్చన, విమల, కుమారుడు వీరేందర్ యాదవ్ ఉన్నాడు. తల్లిదండ్రుల మృతితో వారి కుటుంబం రోడ్డున పడింది. తల్లి మృతదేహాన్ని చూసి పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. వారిని చూసిన స్థానికులు కంటతడిపెట్టారు.

ఎన్నికలకు సహకరించండి

అదనపు డీసీపీ నర్సింహారెడ్డి



శెట్టిపల్లి వాసులతో మాట్లాడుతున్న అదనపు డీసీపీ నర్సింహారెడ్డి

ఆమనగల్లు: శాసనసభ ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని అదనపు డీసీపీ నర్సింహారెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని మంగళపల్లి, శెట్టిపల్లి, ఆకుతోటపల్లి, చింతలపల్లి గ్రామాల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఈనెల 30న నిర్వహించే ఎన్నికల నిర్వహణకు ఓటర్లు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా అల్లర్లకు పాల్పడిన, రెచ్చగొట్టినా, పోలీసు విధులకు ఆటంకం కలిగించినా.. చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా గొడవపడే వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్ నమోదు చేస్తామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాటే గ్యారంటీ

- ప్రజలు మావైపే ఉన్నారు
- హామీల అమలులో కేసీఆర్ విఫలం
- బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదు
- మాజీ మంత్రి, వికారాబాద్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్



అనంతగిరి: ప్రజలకు గ్యారంటీ కార్డును చూపుతున్న ప్రసాద్‌కుమార్


అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పకుండా అమలు చేసి తీరుతుందని మాజీ మంత్రి, వికారాబాద్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండలం సిద్దులూర్, కొటాలగుడెం, పీరంపల్లి, పులుసుమామిడి, పాతూర్, కామరెడ్డిగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను విస్మరించారని అన్నారు. ఈ సారి బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదన్నారు. దేశం కోసం గాంధీ కుటుంబం ప్రాణాలను సైతం లెక్క చేయలేదన్నారు. అటు మోదీ, ఇటు కేసీఆర్ పాలనుకు స్వస్తి పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు పట్టం గడుతూ పేదలను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడేది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ఎక్కడికి వెళ్లినా తమను ప్రజలు ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనన్నారు. తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మహిపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎర్రవల్లి జాఫర్, రాఘువన్ నాయక్, ప్రతాప్‌రెడ్డి, గురువారెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మర్పల్లి: బీఆర్‌ఎస్ పాలనపై విసుగు చెందిన ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మర్పల్లిలో బహుజన్ సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కావలి ప్రభాకర్ తోపాటు 40మంది అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆసరా అంతంతే!

- ఊసే లేని కొత్త పెన్షన్ల మంజూరు
- కలెక్టరేట్, తహసీల్ కార్యాలయాల చుట్టూ చక్కర్లు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మేనిఫెస్టోల్లో పెన్షన్ పెంపు



సాక్షి, సిటీబ్యూరో: పేద కుటుంబాల్లోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల సామాజిక పెన్షన్ల పెంపుపై ఆశలు చిగురిస్తున్నా.. ఇప్పటి వరకు పెన్షన్ మంజూరు కాని అభాగ్యుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా తయారైంది. గత కొన్నేళ్లుగా కొత్తగా సామాజిక పెన్షన్ల మంజూరు లేకుండా పోయింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్ తమ మేనిఫెస్టోల్లో సామాజిక పెన్షన్ల పెంపుపై స్పష్టమైన హామీలు ఇచ్చాయి. అధికార బీఆర్‌ఎస్ ప్రస్తుతం రూ. 2016 పెన్షన్‌ను రూ.5 వేలకు విడతల వారీగా పెంచుతామని ప్రకటించింది. వచ్చే మార్చి తర్వాత పెన్షన్‌ను రూ.3 వేలు, ఆ తర్వాత ప్రతి సంవత్సరం రూ. 500 పెంచుతూ ఐదో సంవత్సరం నిండేనాటికి రూ.5వేలకు అందిస్తామని పేర్కొంది. దివ్యాంగుల పెన్షన్ రూ.4016కు ఉండగా, మార్చి తర్వాత రూ.5వేలు చేసి.. ప్రతి సంవత్సరం రూ. 300కి చొప్పున ఆరు వేలకు వరకు పెంచుతామని స్పష్టం చేసింది. ఇక కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే సామాజిక పెన్షన్లను రూ. 4000కు పెంచుతామని ప్రకటించింది. దీనిపై పేదలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు.

పెండింగ్‌లోనే..

- నాలుగేళ్లుగా కొత్త పెన్షన్ల మంజూరు ఊసే లేకుండా పోయింది. రెండేళ్ల క్రితం వయసు సడలింపునకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల్లో కొన్నింటికి మాత్రమే మంజూరు లభించగా మిగతావి తిరస్కరణకు గురయ్యాయి. సామాజిక పెన్షన్లకు సంబంధించిన ఆఫ్‌లైన్ దరఖాస్తులు మాత్రం పెండింగ్‌లో మగ్గుతున్నాయి. కొత్త పింఛన్ల మంజూరుకు ప్రధానంగా బడ్జెట్ సమస్యగా తయారైనట్లు తెలుస్తోంది. 65 ఏళ్లు దాటిన వృద్ధాప్య, వింతంతు, వికలాంగ, ఒంటరి మహిళలు, కల్లుగీత, బీడీ తదితర పింఛన్ల దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. వాస్తవంగా ఆసరా పింఛన్ల దరఖాస్తుల నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. కేవలం దరఖాస్తుల స్వీకరణ తప్ప మంజూరు మాత్రం లేకుండా పోయింది.
- తహసీల్ ఆఫీసులో సమర్పించిన దరఖాస్తులుపై క్షేత్ర స్థాయి విచారణ జరిపి అధికారులు అర్హుల జాబితాలను కలెక్టరేట్‌కు సిఫార్సు చేయడం, ఆ తర్వాత కలెక్టర్ ఆమోదంతో సెర్ప్‌నకు ప్రతిపాదనలు వెళ్తున్నా.. మంజూరు మాత్రం పెండింగ్‌లో పడిపోతున్నాయి. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. వాస్తవంగా గ్రేటర్ పరిధిలోని సుమారు రెండు లక్షలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అనధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు వృద్ధాప్య పింఛనుదారు మృతి చెందితే అతని భార్యకు పింఛన్ల మంజూరు కూడా లేకుండా పోయింది. దరఖాస్తుదారులు కలెక్టరేట్, తహసీల్ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. పింఛన్లు ఎప్పుడు మంజూరవుతాయో అధికారుల్లో స్పష్టత కరువైంది. దీంతో పెండెన్సీ దరఖాస్తులన్నింటినీ క్లియర్ చేసి కొత్తగా మంజూరు ఇవ్వాలని పేద కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

గ్రేటర్ పరిధిలో ప్రస్తుతం ఆసరా పింఛన్లు ఇలా..

హైదరాబాద్	2,59,985
రంగారెడ్డి	2,02,129
మేడ్చల్	1,47,053

క్లుప్తంగా

గస్తీలో మూడో నేత్రం

ప్రలోభాలపై నిరంతరం నిఘా



ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనంపై అమర్చిన కెమెరా

దౌల్తాబాద్: రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రలోభాలకు పాల్పడకుండా ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఓటర్లకు నగదు, కానుకలు పంపిణీ చేయకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని నియమించింది. ఈ బృందం వాహనాల్లో గస్తీ చేపడుతుంది. ఇటీవల ఈ వాహనాలకు 360 డిగ్రీలు తిరుగుతూ రికార్డింగ్ చేసే ప్రత్యేక సీసీ కెమెరాలను అమర్చారు. జీపీఎస్ అనుసంధానం చేయడంతో రాజకీయ నేతల పనితీరును నిరంతరం ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తోంది. ప్రజలకు పంపిణీ నగదు, కానుకలు గుర్తించేందుకు సహకరిస్తోంది. పోలింగ్ జరిగేంత వరకు ఈ వాహనాలు గస్తీ కాయనున్నాయి.

ముమ్మరంగా తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ధారూరు: మండల కేంద్రంలోని తాండూర్ హైదరాబాద్ ప్రధాన రోడ్డులో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది మంగళవారం రాత్రి 7గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు తనిఖీలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఓ కారులో రూ.కోట్లలో డబ్బులు తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు వారు తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనం క్షుణ్ణంగా తనిఖీ చేసినా నగదు లభ్యమవ్వలేదు. ప్రధాన రహదారి కాకుండా అడ్డదారుల్లో అనుకున్న ప్రాంతానికి డబ్బు చేరవేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్టుషాపులపై పోలీసుల దాడి

24 లీటర్ల మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్‌ఐ శ్రీధర్

మర్పల్లి: కిరాణా షాపుల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని నర్సాపూర్ పెద్దతండాలోని ఓ దుకాణంపై దాడి చేసి 24లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి బలవన్మరణం



తాండూరు టౌన్: గుర్తు తెలియని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. తాండూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అనిల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. రైల్వే స్టేషన్ పరిధిలోని ఓ చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి(55) ఉరేసుకున్నాడు. మృతుడి శరీరంపై చాక్లెట్ రంగు చెక్స్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే 8466938351 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్సై నాయుడు తెలిపిన వివరాల ప్రకారం .. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన అంజ సురేష్(49) లోకయుక్త డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా బుధవారం తపాలాలను తీసుకుని చంద్రాయణగుట్టకు మైలార్‌దేవ్‌పల్లి కల్లు కంపౌండ్ ప్రధాన రహదారి గుండా ప్రభుత్వ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి కారులో వస్తున్న నవీన్‌కుమార్ అతి వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సురేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిర్లక్ష్యంగా కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు మంత్రి కేటీఆర్ రోడ్‌షో

- ఏర్పాట్లను పర్యవేక్షించిన నాయకులు
- ఎంఆర్‌సీహెచ్ స్కూల్ గ్రౌండ్‌లో సిద్ధమైన హెలిప్యాడ్



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మొయినాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు మద్దతుగా ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రోడ్‌షో నిర్వహించనున్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలో గురువారం ఉదయం 11 గంటలకు రోడ్‌షో చేపట్టేందుకు పార్టీ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మంత్రి కేటీఆర్ మొయినాబాద్‌కు హెలికాప్టర్‌లో రానుండడంతో మండల కేంద్రంలోని ఎంఆర్‌సీహెచ్ స్కూల్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. బుధవారం ఉదయం నుంచి పార్టీ నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలిప్యాడ్‌తో పాటు వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను చేపట్టారు. ఎంఆర్‌సీహెచ్ స్కూల్ గ్రౌండ్‌లో జేసీబీ, డోజర్లతో చదును చేయించారు. హెలిప్యాడ్‌లో దిగిన వెంటనే రోడ్‌షోకు వెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ ఏపీ రంగా తదితరులు హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఏర్పాట్లు చేసినవారిలో జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, మాజీ వైస్ చైర్మన్ డప్పు రాజు, పార్టీ మండల ఉపాధ్యక్షులు జయవంత్, సుధాకర్‌యాదవ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, మైనార్టీ నేత మహబూబ్ తదితరులు ఉన్నారు.

నోడల్ అధికారుల నియామకం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియ బుధవారం నుంచే ప్రారంభమైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో 22వ తేదీ వరకు, ఎల్బీనగర్ నియోజక వర్గంలో 20 వరకు, శేరిలింగంపల్లి నియోజక వర్గంలో 23 వరకు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ సమాచారం, ఇతర ఫిర్యాదుల కోసం నియోజకవర్గాల వారీగా నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

నియోజకవర్గం	నోడల్ అధికారి	ఫోన్ నంబర్
జిల్లాస్థాయి	కేఎస్‌జీ కుమారి	79950 86357
ఇబ్రహీంపట్నం	బి.వెంకటేశ్వర్లు	98499 04219
ఎల్.బి.నగర్	పి.విజయలక్ష్మి	77021 04249
మహేశ్వరం	బి.నవత	80080 13151
రాజేంద్రనగర్	రవికుమార్	90105 46941
శేరిలింగంపల్లి	ప్రేమ్‌కుమార్	95150 50844
చేవెళ్ల	రాకేశ్	98497 75689
కల్వకుర్తి	ఎస్.రాజేందర్‌రెడ్డి	90001 01457
షాద్‌నగర్	భాస్కర్	82477 42913

మొగిలిగిద్ద ఠాణా భవనం పరిశీలన



మొగిలిగిద్ద పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలోని పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని బుధవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. తుర్రేబాజ్‌ఖాన్ అనేవ్యక్తి హైదరాబాద్ కోఠి ప్రాంతంలో ఆనాటి నవాబులపై బాంబుదాడిచేసి పారిపోతూ మొగిలిగిద్దకువచ్చి ఆశ్రయం పొందాడని గ్రామస్తులు తెలిపారు. తుర్రేబాజ్‌ఖాన్ ఆచూకీ తెలుసుకున్న నవాబులు మొగిలిగిద్దలో ఏదో జరుగుతోందని, అక్కడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ఇక్కడ పీఎస్‌ను ఏర్పాటు చేశారని గ్రామస్తులు డీసీపీకి వివరించారు. అప్పట్లో పోలీస్ స్టేషన్‌తో పాటు తపాలా కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారని వివరించారు. షాద్‌నగర్‌లో కన్నా ముందు ఇక్కడే పోలీస్ స్టేషన్ ఉండేదని, ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 140 గ్రామాలు ఉండేవని తెలిపారు. మొగిలిగిద్ద పోలీస్‌స్టేషన్‌కు దాదాపు 150 ఏళ్ల చరిత్ర ఉందని చుట్టు ప్రక్కల గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు ఇక్కడినుంచే కార్యకలాపాలను కొనసాగించేవారని వివరించారు. 1985లో మండల వ్యవస్థను తీసుకువచ్చిన ఎన్టీఆర్ మొగిలిగిద్ద పోలీస్‌స్టేషన్‌ను కొందుర్గుకు తరలించారని పేర్కొన్నారు. తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించి పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందుతుందని డీసీపీకి విజ్ఞప్తి చేశారు.

నేడు కాంగ్రెస్‌లోకి నర్సిరెడ్డి



యాలాల: పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నర్సిరెడ్డి గురువారం కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ఈ బుధవారం ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా సమయానికి వేతనం అందక, ఈఎంఐలు కట్టలేక పాట్లు పడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో నిరుద్యోగులతో పాటుగా ఉద్యోగులు సైతం నష్టపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పాలనలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులు ప్రశాంతంగా ఉన్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం నేడు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు డబ్బికార్ గుడ్‌బై

ఇబ్రహీంపట్నం: మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన డబ్బికార్ శ్రీనివాస్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. తెలంగాణ ఉద్యమంలో పలు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని ఇటు కేసీఆర్, అటు కేటీఆర్ కు సన్నిహితుడిగా మెలిగారు. పార్టీ రాష్ట్ర కా ర్యదర్శిగా పనిచేశారు. మారిన రాజకీయ ప రిస్థితుల నేపథ్యంలో తెలంగాణ కోసం ము ందుండి పోరాటం చేసిన ఉద్యమకారుల ను పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడంలేదని ఆయన పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తాజాగా బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు ప్రకటించారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇ బ్రహీంపట్నం నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి మద్దతుగా బుధవారం నామినేషన్ ఉపసంహరించుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో చర్చించి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

నిధులిస్తామని ‘కారు’ ఎక్కించారు



ధారూరు: ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఠాగూర్ తదితరులు

- ఎమ్మెల్యే ఆనంద్‌పై గిరిజన నేత ఫైర్
- సొంతగూటికి చేరిన ఠాగూర్

ధారూరు: కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీటీసీ సభ్యుడిగా పోటీ చేసి ఓడిన తనను తండా అభివృద్ధికి రూ.8లక్షల నిధులిస్తామని చెప్పి బీఆర్‌ఎస్‌లో చేర్చుకుని ఎమ్మెల్యే మోసం చేశారని రాంపూర్‌తండా వాసి ఠాగూర్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ సమక్షంలో సొంతగూటికి చేరారు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఆనంద్ తండా అభివృద్ధికి నయా పైసా కేటాయించలేదని.. దీంతో తండా అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరున్నట్లు ప్రకటించారు.

హస్తం గూటికి బీఆర్‌ఎస్ నాయకులు

మండల పరిధిలోని మోమిన్‌కలాన్, మోమిన్‌ఖుర్దు, అల్లాపూర్, దోర్నాల్ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్‌కు చెందిన 80 మంది నాయకులు, కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. వారికి ప్రసాద్‌కుమార్ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, వాలీబాల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, రాంపూర్‌తండా సర్పంచ్ పాండునాయక్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, మల్లారెడ్డి, మాన్‌సింగ్, హరిచంద్, రాజేందర్, బుజ్జయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దిగి వచ్చిన ‘రెబల్స్’

సాక్షి, సిటీబ్యూరో: అధిష్టానాల బుజ్జగింపులతో రెబల్స్ దిగొచ్చారు. ఆయా పార్టీల పెద్దలు రంగంలోకి దిగి పోటీ నుంచి తప్పుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయంగా అవకాశం కల్పించనున్నట్లు స్పష్టమైన హామీ ఇవ్వడంతో వారంతా నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన చిన్న శ్రీశైలం యాదవ్ తనయుడు నవీన్ యాదవ్ కాంగ్రెస్ పెద్దల సూచన మేరకు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఆ పార్టీ అభ్యర్థి అజహరుద్దీన్ బుధవారం స్వయంగా వారి ఇంటికి చేరుకుని ఆయనను బుజ్జగించారు. దీంతో నామినేషన్ ఉపసంహరించుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేయనున్నట్లు ప్రకటించారు. కాగా.. రెండు రోజుల క్రితం బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కూడా ఆయన ఇంటికి వెళ్లి ఇదే అంశంపై చర్చించడం తెలిసిందే. అయితే ఆయన మాత్రం బీజేపీని కాదని, కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థి దండెం రాంరెడ్డి అధిష్టానం విజ్ఞప్తి మేరకు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఆయన కాంగ్రెస్‌ను వీడి అధికార బీఆర్‌ఎస్‌లో చేరే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇక చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సున్నపు వసంతం కూడా పోటీ నుంచి వెనక్కి తగ్గారు.

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం



కేరెళ్లిలో ప్రచారం చేస్తున్న ప్రియ తదితరులు

- కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్ సోదరి ప్రియ

ధారూరు: సొంత గ్రామాన్నే పట్టించుకోని ఎమ్మెల్యే ఆనంద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారంటే ఎవరూ నమ్మరని కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్ సోదరి ప్రియ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో కేరెళ్లిలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాతల సహాయంతో అభివృద్ధి పనులు చేయిస్తే.. వాటిని ఎమ్మెల్యే ఖాతాలో వేసుకుంటున్నారన్నారు. ఏడేళ్లు కావొస్తున్న అసంపూర్తిగా ఉన్న దోర్నాల్ వంతెనను పూర్తి చేయలేకపోయారన్నారు. కాగ్నా ఉపనదిపై ఉన్న చింతకుంట వంతెన పదేళ్లుగా పూర్తికాక వెక్కిరిస్తోందన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో రోడ్లు పూర్తిగా అధ్వాన స్థితికి చేరిన వాటిపై కనీసం మట్టి పోయించే నాథుడే లేడదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని బలపర్చి చేతి గుర్తుకు ఓటేయాలని ఆమె కోరారు. అనంతరం ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు మల్లారెడ్డి, దయాకర్‌రెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్రులే అధికం

- గ్రేటర్ జిల్లాల్లో వారివే ఎక్కువ నామినేషన్లు
- పూర్తయిన గుర్తుల కేటాయింపు
- 29 అసెంబ్లీ స్థానాల నుంచి 649 మంది అభ్యర్థులు పోటీ
- స్వతంత్ర అభ్యర్థులు 532 మంది.
- అత్యధికంగా ఎల్బీనగర్ బరిలో 48
- అత్యల్పంగా కంటోన్మెంట్ స్థానంలో 10

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి కావడంతో పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల సంఘం వెల్లడించింది. గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 649 మంది అభ్యర్థులు శాసనసభ ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ,మజ్లిస్, బీఎస్పీ, సీపీఐ(ఎం) తోసహా ఎన్నికల సంఘం గుర్తింపు పార్టీల అభ్యర్థులు 117 మంది ఉండగా, 532 మంది స్వతంత్ర అభ్యర్థులుగా తమ బలాన్ని ప్రదర్శించుకోనున్నారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలోని ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీలతో సహా స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 48 మంది పోటీలో ఉన్నారు. అత్యల్పంగా హైదరా బాద్ జిల్లాలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 10 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఐదు స్థానాల్లో 30 మంది కంటే ఎక్కువ మంది

గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లో 30 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాలు ఐదు ఉండగా, హైదరాబాద్ జిల్లాలో నాంపల్లి అసెంబ్లీ స్థానంలో 34 మంది అభ్యర్థులు, ముషీరాబాద్‌లో 31 మంది పోటీ పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి అసెంబ్లీ స్థానంలో 33 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 32 మంది అభ్యర్థులు, మల్కాజిగిరి స్థానంలో 33 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.

12 అసెంబ్లీ స్థానాల్లో 20 కంటే ఎక్కువ అభ్యర్థులు

గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20 మంది కంటే ఎక్కువ అభ్యర్థులు ఎన్నికల రణరంగంలో పోటీ పడుతున్నారు. హైదరాబాద్ జిల్లా మలక్‌పేట్‌లో 27 మంది, అంబర్‌పేట్‌లో 20 మంది, ఖైరతాబాద్‌లో 25 మంది, గోషామహాల్‌లో 21 మంది, యాకత్‌పురలో 27 మంది,సికింద్రాబాద్ అసెంబ్లీ స్థానంలో 24 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రంగారెడ్డి జిల్లా కల్వకుర్తిలో 24 మంది, మహేశ్వరంలో 27, ఇబ్రహీంపట్నంలో 28, రాజేంద్రనగర్‌లో 25 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్ స్థానంలో 22 మంది, కూకట్‌పల్లిలో 24 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

గుర్తుల కేటాయింపు..

అసెంబ్లీ బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులకు వారి సూచన మేరకు గుర్తుల కేటాయింపు కార్యక్రమాన్ని బుధవారం రాత్రి వరకు ఆయా శాసనసభ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పూర్తి చేశారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన గుర్తుల జాబితా నుంచి స్వతంత్రులకు సింబల్ కేటాయింపులు పూర్తి చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. గుర్తుల కేటాయింపు కార్యక్రమం పూర్తికావటంతో ...గురువారం నుంచి ఎన్నికల ప్రచారం హోరెత్తనుంది.

‘గులాబీ’ గూటికి స్వతంత్రులు

షాద్‌నగర్: ఎన్నికల బరిలో నిలిచేందుకు నామినేషన్ వేసి ఉపసంహరించుకున్న పలువురు స్వతంత్ర అభ్యర్థులు బుధవారం ‘గులాబీ’ తీర్థం పుచ్చుకున్నారు. మాదాసి కుర్వ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎమ్మె సంతోష్‌కుమార్, టీడీపీ వ్యవస్థాపక సభ్యులు మఠం శశిధర్, శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారు. బుధవారం వారు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకుని ఎంపీపీ రవీందర్ యాదవ్, యువనేత మురళీకృష్ణ యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇక సమరమే..



పూర్తయిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ

- పరిశీలన దశలో 31 నామినేషన్ల తిరస్కరణ
- తాజాగా మరో 38 ఉపసంహరణ
- బరిలో 211 మంది అభ్యర్థులు
- ఇక పూర్తిస్థాయి ప్రచారంలోకి ప్రధాన పార్టీలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో మొత్తం 280 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, వీరిలో ఈ నెల 13న నిర్వహించిన రిటర్నింగ్ ఆఫీసర్ల పరిశీలనలో 31 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. తాజాగా మరో 38 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం 211 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిల్చున్నారు. ప్రధాన పార్టీలైన అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ నుంచి 24 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, మిగిలిన వారు బీఎస్పీ, సీపీఎం, భారత చైతన్య యువజన పార్టీ, జన శంఖారావం, యుగతులసి, నవరంగ్ కాంగ్రెస్, ఆల్ ఇండియా మహిళా ఎంపవర్, బహుజన రిపబ్లికేషన్ సోషలిస్ట్, ధర్మసమాజ్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, దళిత్ బహుజన్, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫారమ్స్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. వీరంతా ఆయా నియోజకవర్గాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

బుజ్జగింపుల తర్వాత..

నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణ ముగిసింది. ఏ పార్టీ నుంచి ఎవరు పోటీలో ఉంటున్నారనే అంశంపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. ఆయా పార్టీల నుంచి టికెట్లు ఆశించినప్పటికీ బీఫాం రాకపోవడంతో రెబల్ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారిని ఆయా పార్టీల అధిష్టానాలు బుజ్జగించాయి. రాజకీయ భవిష్యత్తుపై హామీ ఇవ్వడంతో వారు కూడా శాంతించారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన దండెం రామిరెడ్డి తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. అయితే ఆయన కాంగ్రెస్‌ను వీడే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సున్నపు వసంతం సైతం తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు.అధిష్టానం నుంచి ఆయనకు స్పష్టమైన హామీ లభించిన తర్వాతే ఆయన పోటీ నుంచి తప్పుకొన్నట్లు తెలిసింది. అధికార బీఆర్‌ఎస్ ఇప్పటికే అసంతృప్తులను బుజ్జగించింది. ఇప్పటికే వారు రెండు ధపాల్లో నియోజకవర్గం మొత్తం తిరిగారు.మరోసారి నియోజకవర్గాన్ని చుట్టేందుకు రెడీ అవుతున్నారు.నిన్న మొన్నటి వరకు అసంతృప్తుల బుజ్జగింపుల్లోనే బిజీగా మారిన ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు సైతం ప్రచారంపై దృష్టి సారించారు. ఇప్పటికే ప్రచార రథాలు సిద్ధం చేసుకున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం బీజేపీ నుంచి టికెట్ ఆశించిన భంగపడిన నేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి బరిలో ఉన్నారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి,బహిష్కరణకు గురైన కొత్త మనోహర్‌రెడ్డి బీఎ స్పీ నుంచి పోటీలో నిలిచారు. వీరిద్దరూ ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

దాఖలైన నామినేషన్లు, తిరస్కరణ, ఉపసంహరణ

నియోజకవర్గం	అభ్యర్థులు	తిరస్కరణ	ఉప సంహరణ	పోటీలో ఉన్న అభ్యర్థులు
కల్వకుర్తి	28	01	03	24
మహేశ్వరం	34	02	05	27
చేవెళ్ల	19	04	03	12
షాద్‌నగర్	24	03	07	14
ఇబ్రహీంపట్నం	39	04	07	28
శేరిలింగంపల్లి	41	05	03	33
ఎల్బీనగర్	62	05	09	48
రాజేంద్రనగర్	33	07	01	25
మొత్తం	280	31	38	211